వేధిస్తున్న విద్యుత్ సిబ్బంది కొరత

- ఇన్‌చార్జ్ ఏఈగా సబ్‌ఇంజనీర్
- తొమ్మిది మంది లైన్‌మెన్లకు ఇద్దరే దిక్కు

మోటకొండూర్: మోటకొండూర్ మండలంలో విద్యుత్ సిబ్బంది కొరత వేధిస్తోంది. మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా ఇంటి, కమర్షియల్ విద్యుత్ కనెక్షన్లు 7900 ఉండగా 5600 వ్యవసాయ బావుల కనెక్షన్లు ఉన్నాయి. ఏఈ, సబ్ ఇంజనీర్, అటెండర్, సబ్‌స్టేషన్‌కు ముగ్గురు ఆపరేటర్లు, 1500 సర్వీస్‌లకు లైన్‌మెన్, ఏఎల్ఎంను కానీ ఒక జేఎల్ఎంని కాని కేటాయించాలి. త్రీ ఫేస్ కనెక్షన్లకు 7వేలకు ఒకరి చొప్పున లైన్ ఇన్‌స్పెక్టర్‌ను కేటాయించాలి. కానీ మండలంలో సబ్‌ఇంజనీర్‌కు ఇంచార్జ్ ఏఈగా నియమించారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలో 9 మంది ఆపరేటర్లు, ఇద్దరు లైన్‌మెన్, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, ఒక జేఎల్ఎం, ఆరుగురు ఏఎల్ఎంలు మాత్రమే పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా లైన్‌మెన్, ఏఎల్ఎంల కింద ఆర్టీజన్లుగా ముగ్గురు అసిస్టెంట్‌లను నియమించారు. వీరు ఇక్కుర్తి, దిలావర్‌పూర్, అమ్మనబోలు, చాడ, కొండాపురం పరిధిలో పనిచేస్తున్నారు. సిబ్బంది కొరత కారణంగా బ్రేక్ డౌన్, వ్యవసాయ బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినా, ఫ్యూస్‌లు పోయినా, కరెంట్ లూజ్ వైర్లు తెగిపోయినా, ఫ్యూస్ ఆఫ్ కాల్‌లకు తీవ్ర ఇబ్బంది అవుతోంది. వర్షాకాలంలో వీరికి తీవ్ర పని ఒత్తిడి నెలకొంటుంది.


మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

భర్తీ కానీ ఖాళీ పోస్టులు

మోటకొండూర్ మండల కేంద్రంలో ఇద్దరు లైన్‌మెన్లు, ఒక లైన్ ఇన్‌స్పెక్టర్, అమ్మనబోలు లైన్‌మెన్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. మాటూర్, ఇక్కుర్తి, వర్టూర్, గ్రామాల్లోని లైన్‌మెన్‌లు బదిలీపై వెళ్లారు. ఇలా ఖాళీ అయిన పోస్టుల్లో ఎవరినీ కేటాయించలేదు. దీంతో మండలంలో మొన్నటి వరకు 9 మంది లైన్‌మెన్‌లు ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. మండలంలో విద్యుత్ సిబ్బంది కొరతను తొలగించే విధంగా ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్ తగిన చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



మోటకొండూర్ మండలంలో విద్యుత్ ఏఈ లేక సబ్ ఇంజనీర్‌కు ఇన్‌చార్జ్ ఏఈ బాధ్యతలు అప్పగించారు. పెద్ద గ్రామాల్లో సైతం లైన్‌మెన్‌లు లేక ఏఎల్ఎంలతో పని చేయిస్తున్నారు. మండల వ్యాప్తంగా లైన్‌మెన్‌లు, జేఎల్ఎంలు, ఏఎల్ఎంలు, కట్టర్‌ల కొరత ఉంది.

– బొలగాని జయరాములు గౌడ్, సీపీఎం జిల్లా నాయకుడు

సమన్వయంతో పనిచేస్తున్నాం



సిబ్బంది కొరత ఉన్నప్పటికీ మండల ప్రజలకు ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా సమన్వయంతో పనిచేస్తున్నాం. విధుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో పని చేస్తున్నాం. సిబ్బంది కూడా పూర్తిగా సహకరిస్తున్నారు.

– సాగర్, ఇన్‌చార్జ్ ఏఈ

క్లుప్తంగా

108 వాహనంలో గర్భిణి ప్రసవం


శిశువును చూపుతున్న అంబులెన్స్ సిబ్బంది

భువనగిరి: 108 అంబులెన్స్ వాహనంలో గర్భిణి ప్రసవించింది. సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం .. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన అనరాశి సుస్మిత ఈ నెల 10న జిల్లాకేంద్ర ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పరిశీలించి ప్రస్తుత మహిళకు 8వ నెల నడుస్తుందని, కాన్పు నిర్వహించడం సాధ్యం కాదని గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. దీంతో 108 అంబులెన్స్‌లో భువనగిరి నుంచి రాత్రి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ప్రసవించింది. ఆడ శిశువుకు జన్మనివ్వగా.. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. మెడికల్ టెక్నీషియన్ మహేష్, సిబ్బంది తాండూరి వెంకటేష్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకం

ఆలేరు రూరల్ : రాష్ట్రంలో విపక్ష పార్టీలు బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మండలంలోని కొలనుపాక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అసెంబ్లీ ఏకగ్రీవం తీర్మానం చేసి కేంద్రానికి పంపితే పార్లమెంటులో బిల్లు పాస్ చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉండటానికి కూడా బీజేపీ నాయకులే కారణమని ఆరోపించారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ పరోక్షంగా కోర్టులో కేసులు వేయిస్తుందని అన్నారు. సమావేశంలో నాయకులు జితేందర్‌రెడ్డి, కొరుటూరి సతీష్, పేరపు స్వామి పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

బొమ్మలరామారం : రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు స్టేతో బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నెమైన వెంకటేష్ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన బీసీ హక్కుల సాధన సమితి మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీసీల న్యాయమైన రిజర్వేషన్ల కోసం పోరాటం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పిట్టల శంకర్, పల్లపు మల్లేష్, జిన్న రాజు, ఇండ్ల చంద్రయ్య, కోట శ్రీను, కూర రాములు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లపై ఎందుకంత అక్కసు

మోత్కూరు: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే అగ్రవర్ణాలకు ఎందుకంత అక్కసు అని బీసీ విద్యార్థి, యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు గడ్డం నర్సింహ అన్నారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీలపై కక్షతో రాజకీయంగా ఎదగకుండా అగ్రవర్ణాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో 63 శాతం జనాభా కలిగిన బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఓర్సు మహేష్, దళిత యునైటెడ్ ఫ్రంట్ జిల్లా ఇన్‌చార్జ్ కూరెళ్ల రాజశేఖర్, మధు, సాయిలు పాల్గొన్నారు.

బీసీలను తప్పదోవ పట్టిస్తున్న ప్రభుత్వం

ఆలేరు రూరల్ : రిజర్వేషన్ల అంశంలో బీసీలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టిస్తుందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ రచ్చ రామ్‌నర్సయ్య విమర్శించారు. మండలంలోని శారాజీపేట గ్రామంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ పరిధిలో సరైన కసరత్తు చేయకుండా జీఓను రూపొందించడం కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కంతి మహేందర్, బండ మహేందర్, కంతి మల్లయ్య, అశోక్, సముద్రాల కుమార్, దూడల శ్రీధర్, శ్రీను, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ఏకం కావాలి

సంస్థాన్ నారాయణపురం: బీసీలు పార్టీలకతీతంగా ఏకం కావాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గణం నర్సింహ అన్నారు. శనివారం సంస్థాన్ నారాయణపురంలో సంఘం సమావేశం నిర్వహించారు. నాయకులు ఉప్పరగోని రాజు, రత్తుపల్లి యాదయ్య, చరక సత్తమ్మ, తెలంగాణ భిక్షం, బైకని నరేందర్, శేఖర్, కృష్ణయ్య, హరిప్రసాద్ పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించాలి

మోత్కూరు : మోత్కూరు భారత్ గ్యాస్ పరిధిలోని వినియోగదారులు ఈ నెల 21లోపు ఈకేవైసీ చేయించకుంటే గ్యాస్ కనెక్షన్ రద్దవుతుందని కార్యాలయం ఇన్‌చార్జ్ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఆధార్, మొబైల్ నంబర్‌తో గ్యాస్ ఏజెన్సీ వద్ద ఈకేవైసీ చేయించాలని పేర్కొన్నారు. మోత్కూరు భారత్ గ్యాస్ కార్యాలయం పరిధిలో సుమారు రూ.23 వేల కనెక్షన్లు ఉండగా 20 వేల కనెక్షన్‌దారులు ఈ కేవైసీ చేయించుకున్నారని, మిగిలిన 3 వేల మందికి పైగా ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

ఆలేరులో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

ఆలేరు రూరల్ : ఆలేరులో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ కోరారు. ఆలేరులో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధార్ కేంద్రం లేకపోవడంతో తప్పుగా ఉన్న ఇంటి పేర్లు, పేర్లు, వయస్సును సరి చేసుకోవడానికి ప్రజలు భువనగిరి, జనగాం వంటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ మండల అధ్యక్షుడు చొడబోయిన కనకయ్య, గొట్టిపాముల శ్రీనివాస్‌రాజు, బొడ్డు ఆంజనేయులు, రవి, మధు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మల్లేశం

వలిగొండ : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 8, 9వ తేదీల్లో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వలిగొండ మండలం ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన మల్లేశంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ


మిషన్లు పంపిణీ చేస్తున్న గ్రంథాలయం అధ్యక్షుడు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని జనగాం గ్రామంలో గల ప్రజాకవి కాళోజీ గ్రంథాలయంలో శనివారం అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయం అధ్యక్షుడు ఆందోజు నాగభూషణం శిక్షణ పొందిన 28 మంది మహిళలకు రూ.3500 సబ్సిడీతో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయం ప్రధాన కార్యదర్శి లోడే నరేష్, కోశాధికారి లోడే యాదయ్య, గౌరవ సలహాదారు బొంగు బుచ్చయ్య, ఉపాధ్యక్షుడు ఎదుటి తిరుమలేష్, గడ్డం యాదయ్య, హైమద్, ధనమ్మ, పద్మ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

తుర్కపల్లి : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న ఓపెన్ ఫోరమ్ నిర్వహించనున్నట్లు ఏపీఓ నారాయణ శనివారం తెలిపారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఆత్మకూరు (ఎం) : చౌటుప్పల్‌లో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాలుగో మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయరాములు కోరారు. మండల కేంద్రంలో శనివారం కల్లుగీత కార్మిక సంఘం నాయకులతో కలిసి మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభకు ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెరుపు మల్లేశం గౌడ్, మండల గౌరవ అధ్యక్షుడు పంజాల నర్సయ్య, మండల అధ్యక్షుడు గడ్డం దశరథ గౌడ్, కార్యదర్శి గుండెగాని అయిలయ్య, నాయకులు ముద్దసాని పెద్ద శంకరయ్య, పంజాల సత్తయ్య, ముత్యాల మల్లేశం గౌడ్, బబ్బూరి రాములు, పల్సం శ్రీరాములు పాల్గొన్నారు.

దత్తాయిపల్లిలో..

తుర్కపల్లి: కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలో మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మారగొని శ్రీరామమూర్తి గౌడ్, గౌరవాధ్యక్షుడు కొక్కొండ లింగయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటేష్ గౌడ్, కనీనర్ కొండం బాలయ్య, స్వామిగౌడ్, రాజ్‌కుమార్, నర్సింహులు, బాల్‌శెట్టి, జెమ్మయ్య, చంద్రయ్య, మల్లేష్ పాల్గొన్నారు.


ఆత్మకూరు (ఎం) : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

చిత్తడిగా మారిన వెల్లంకి- వెలిమినేడు రోడ్డు

రామన్నపేట: రామన్నపేట మండలం వెల్లంకి - చిట్యాల మండలం వెలిమినేడు గ్రామాల మధ్య గల లింక్‌రోడ్డు (మట్టిరోడ్డు)పూర్తిగా దెబ్బతిన్నది. సుమారు ఇరవై సంవత్సరాల క్రితం ఇరు గ్రామాల మధ్య మట్టి రోడ్డు వేశారు. తిరిగి ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలుస్తోంది. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుకు అవసరమైన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.





బాలికలపై చిన్నచూపు తగదు

ఆత్మకూరు (ఎం) : మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తౌర్ర విష్ణు మాట్లాడుతూ.. సమాజంలో బాలికల పట్ల చిన్న చూపు తగదని, వారి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సయ్య, వైస్ ప్రిన్సిపాల్ ఐలయ్య పాల్గొన్నారు.

గుండాల కేజీబీవీలో..

గుండాల : మండల కేంద్రంలోని కేజీబీవీలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశంతో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, బాల్య వివాహాలు, వివాహ రిజిస్ట్రేషన్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎల్‌వీలు మల్లేషం, ఎండీ.మౌలానా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులు విజయం సాధించాలి


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన ప్రధాని మోదీ స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శాగ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు కైరంకొండ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, పాలకూర్ల జంగయ్య, యాదయ్య, మల్లేష్, రమేష్, వెంకటేష్, అశోక్‌రెడ్డి, కృష్ణ, సత్తయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన రెవెల్లి నర్సింహకు సీఎం సహాయనిధి నుంచి రూ.28వేల చెక్కు మంజూరైంది. ఈ చెక్కును శనివారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు పానుగంటి లింగస్వామి, మాజీ సర్పంచ్ టింగిల్‌కార్ వెంకటేశం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు చింతల శ్రీశైలం, సీనియర్ నాయకులు బద్దం నర్సింహ, కర్రెవాల నర్సింహ, బద్దం రాజేశ్వర్, ఉడుతల సాయిరాం, బీమగాని రాజారాం, బోయిని రాజు తదితరులు పాల్గొన్నారు.

చేనేత రుణాలు మాఫీ చేయాలి

ఆలేరు: చేనేత కళాకారుల రుణాలను తక్షణమే మాఫీ చేయాలని పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బేతి రాములు, ప్రధాన కార్యదర్శి బింగి నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాలు మాఫీ చేస్తామని గతంలో సీఎం హామీ ఇచ్చారని, ప్రస్తుతం విస్మరించారని విమర్శించారు. ఎలాంటి షరతులు లేకుండా కొత్త రుణాలను మంజూరు చేయాలని కోరారు.

బాలరాజు మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ క్రియాశీల కార్యకర్త కరగల్ల బాలరాజు మృతి పార్టీకి తీరనిలోటని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం తెల్లవారుజామున కరగల్ల బాలరాజు(40) గుండెపోటుతో మృతి చెందగా.. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ బాత్క లింగస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, స్థానిక మాజీ కౌన్సిలర్ పెద్దల చక్రపాణి, నాయకులు కొమ్ము లక్ష్మణ్, కరగల్ల కుమార్, నల్ల నాగేశ్, ఎడ్ల లింగస్వామి, పెద్దల సుధాకర్, నరహరి, సతీష్, ఏల్లేశ్, శ్యామ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గుండాల : మండలంలోని మాసాన్‌పల్లి, మరిపడిగ, వస్తాకొండూర్, పెద్దపడిశాల గ్రామాల్లో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ శనివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ మందడి రామకృష్ణారెడ్డి, బబ్బూరి సుధాకర్, వై.వెంకట్‌రెడ్డి, ఎం.బాల్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రంజిత్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్‌రెడ్డి, శోభన్ బాబు, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఇసుక డంప్ సీజ్

ఆత్మకూరు (ఎం) : మండలంలోని తుక్కాపురం పరిధి పోసానికుంట వద్ద డంప్ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. వ్యవసాయ భూమి సర్వే నంబర్ 223లో ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్ల యజమానులు ఇసుక డంప్ ఏర్పాటు చేశారని గుర్తు తెలియని వ్యక్తుల ఇచ్చిన సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు శ్రీనివాసచారి, రాజయ్య, దాసరి వీరన్న పరిశీలించి సీజ్ చేశారు. అనంతరం కేసు నమోదు నిమిత్తం పోలీస్ శాఖకు అప్పగించారు.

ప్రధాని మోదీ ప్రసంగం వీక్షించిన రైతులు

చౌటుప్పల్ : ప్రధాని మోదీ ప్రధానమంత్రి ధన్-ధన్య వ్యవసాయ పథకం, పప్పు ధాన్యాల స్వావలంబన మిషన్‌ను శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు అవసరమయ్యే పథకాలు, పంటల దిగుబడులు, ఆదాయాన్ని పెంపొందించుకునే మార్గాలపై ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గం, రైతులు వీక్షించారు. మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పబ్బు శ్రీకాంత్, చప్పిడి సంజీవరెడ్డి పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

రాజాపేట : మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన ఆముదాల రమేష్ ఇటీవల మృతిచెందాడు. రమేష్ కుటుంబానికి స్థానిక ఉన్నత పాఠశాల 1993–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శనివారం రూ.59,600 నగదుతో పాటు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, రమేష్ స్నేహితులు తోట సత్తయ్య, నీల సిద్ధిరాజ్, నాగాయపల్లి శ్రీనివాస్, నాగారం భిక్షపతి, మూల మల్లేశం, కట్కే పరమేష్, గడిపె చంద్రయ్య, మడిశెట్టి వెంకటేశం, పి.గోపాల్, ఎన్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

రామన్నపేట: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. రామన్నపేటలో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన డాక్యుమెంట్లు లేని వాహనదారులకు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగరాజు, ఏఎస్ఐ సురేందర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

భువనగిరి: భువనగిరి పట్టణంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ నాయకులు శనివారం కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేసేందుకు వెళ్తుండగా.. పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేసి భువనగిరి రూరల్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం కొద్ది సేపటి తర్వాత విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, నాయకులు పడమటి జగన్మోహన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పన్నాల చంద్రశేఖర్‌రెడ్డి, రత్నపురం బలరాం, మంగు నర్సింగ్‌రావు, కుమార్, వల్దాస్ కాళభైరవ తదితరులున్నారు.

జలనారాయణ స్వామికి మంగళహారతి


జలనారాయణ స్వామికి మంగళహారతి సమర్పిస్తున్న అర్చకులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జలనారాయణ స్వామి శనివారం రాత్రి మంగళహారతి సమర్పించారు. ఉదయం సమయంలో స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణ మహోత్సవం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 5వేల మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం స్వామి వారికి తిరువీధి ఉత్సవ సేవ నిర్వహించారు. రెండో శనివారం కావడంతో క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజాపేట : మనస్తాపంతో గడ్డి మందు తాగిన ఆటో డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన బొమ్మకంటి నర్సింహులు (39) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన విద్యార్థులను, గ్రామస్తులను ఆటోలో ఎక్కించుకుని ఆలేరుకు వెళ్తున్నాడు. కొలనుపాక శివారులో అదుపుతప్పి ఆటో బోల్తాపడగా అందులోని వారికి గాయాలయ్యాయి. తన నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం చోటుచేసుకుందని మనస్తాపానికి గురై నర్సింహులు గడ్డి మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతడిని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం జనగామ ఆస్పత్రికి.. అటు నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

గుర్తింపునకు నోచని ‘సంస్థానం’

- 17వ శతాబ్దంలో సంస్థానంగా ఏర్పడిన నారాయణపురం
- ఈ ప్రాంత పేరులో సంస్థాన్ అనే పదాన్ని ప్రభుత్వ గెజిట్‌లో చేర్చాలని డిమాండ్


సంస్థాన్‌నారాయణపురం గ్రామ ప్రవేశ ద్వారం

సంస్థాన్ నారాయణపురం: రాజులు పోయినా.. రాజ్యాలు కూలినా వారు నిర్మించిన అపురూప కట్టడాలు నేటికి సజీవంగా నిలుస్తున్నాయి. 17వ శతాబ్దంలో ‘సంస్థానం’ గా ఏర్పడి విలసిల్లిన నారాయణపురంలోని చారిత్రక ఆనవాళ్లు నేటికీ ఉన్నాయి. సుమారు 300 సంవత్సరాల చారిత్రక ప్రాముఖ్యత ఉన్న సంస్థాన్‌నారాయణపురంను గతం ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేసాయి. నారాయణపురం కాకుండా సంస్థాన్ నారాయణపురంగా గుర్తించాలని ఇక్కడి ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు మారుతున్నా సంస్థాన్ పదాన్ని చేర్చడంపై దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

వెంకటనారాయణ పేరు మీదుగా సంస్థాన్ నారాయణపురం

17వ శతాబ్దంలో నారాయణపురాన్ని పరిపాలించిన నైజాం నవాబు మీర్ నిజాం అలీఖాన్ హయాంలో ఈ ప్రాంతానికి వెంకటనారాయణ బహదూర్‌గా ఉండేవారు. మరాఠా సైన్యానికి, నవాబు సైన్యానికి యుద్ధం సమయంలో నవాబు సైన్యాన్ని ముట్టడించారు. దీంతో వెంకటనారాయణ బహదూర్ నవాబు అనుమతితో మరాఠా సైన్యం పైకి యుద్ధానికి వెళ్లాడు. వెంకటనారాయణ బహదూర్ తనతో ముఖాముఖి యుద్ధానికి రమ్మని మరాఠా సైన్యానికి సవాల్ విసిరారు. మరాఠా సైన్యాన్ని ఓడించడంతో సంతోషించిన నైజాం నవాబు నారాయణపురంను సంస్థానంగా ప్రకటించారు. వెంకటనారాయణ బహదూర్‌ను సంస్థానాధీశుడిగా నియమించారు. ఈయన పేరుతోనే సంస్థాన్ నారాయణపురం ఎంతో పేరు ప్రఖ్యాతలు పొందింది. ఇంతటి చారిత్రక ప్రాముఖ్యత ఉన్న సంస్థాన్‌నారాయణపురంను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పందించి నారాయణపురానికి సంస్థాన్ అనే పదాన్ని ప్రభుత్వ గెజిట్‌లో చేర్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

కంఠమహేశ్వరుడికి బోనాలు

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని గౌస్‌కొండ గ్రామంలో శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో కంఠమహేశ్వరస్వామి(కాటమయ్య) బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా వచ్చి కంఠమహేశ్వరస్వామి, సురమాంబదేవికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కాసుల వెంకటేశ్‌గౌడ్, మల్లేశ్, మునుకుంట్ల నరేశ్‌గౌడ్, వెంకటేశ్, మల్లేశ్ గౌడ్, కుమార్, గోపి, శ్రీధర్, రజనీకాంత్, కంఠం గౌడ్, గోవర్ధన్, దేవయ్య, రాఘవేంద్ర, ప్రశాంత్, భాను, బన్ని పాల్గొన్నారు.


బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు